రోడ్డుపై సంత.. ట్రాఫిక్ చింత

- స్థలం లేక రోడ్డుకు ఇరువైపులా సంత నిర్వహణ
- వాహనాల రాకపోకలకు తప్పని ఇబ్బందులు
- ప్రత్యేక స్థలం కేటాయించాలని వేడుకోలు


త్రిపురారం మండల కేంద్రంలో రోడ్డుపై నిర్వహిస్తున్న కూరగాయల సంత

త్రిపురారం : మండల కేంద్రంలో వారాంతపు సంతలు రోడ్డుపైనే నిర్వహిస్తున్నారు. రోడ్డుపై సంతలు నిర్వహిస్తుండడంతో రోడ్లపై రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై సంతలు కొనసాగుతున్న విషయాన్ని ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవంలేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చే వాహనదారులు ప్రధాన రోడ్లపైనే సంతలు కొనసాగుతుండడంతో వాహనాలను పార్కింగ్ చేయడానికి స్థలం లేక ట్రాఫిక్ జామ్‌తో అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు పేర్కొంటున్నారు. త్రిపురారం మండల కేంద్రంలో గత 40ఏళ్లుగా ప్రతి సోమవారం మండల కేంద్రంలో వారాంతపు కూరగాయల సంత కొనసాగుతుంది. వివిధ గ్రామాల్లో రైతులు పండించిన కూరగాలతో పాటుగా పలు ప్రాంతాల నుంచి కూరగాయల వ్యాపారులు వచ్చి ఇక్కడ సంతలో వ్యాపారం నిర్వహిస్తారు. మండలంలో 32గ్రామ పంచాయతీలు ఉండగా ఎక్కువగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల నుంచి ప్రజలు ప్రతి సోమవారం మండల కేంద్రానికి వచ్చి వారానికి సరిపడా కూరగాయలతో పాటుగా నిత్యావసర సరుకుల కొనుగోలు చేస్తుంటారు. దీంతో వ్యాపారస్తులకు వ్యాపారంతో పాటుగా వందలాది మందికి ప్రతి వారం ఉపాధి దొరుకుతుంది.

తప్పని ఇక్కట్లు

త్రిపురారం మండల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే వారాంతపు కూరగాయల సంత వల్ల స్థానికులతో పాటుగా గ్రామాల్లోని ప్రజలకు తాజా కూరగాయల తోపాటుగా , పండ్ల కూడా తాజాగా దొరుకుతాయి. మండలంలో కూరగాయలు, ఆకు కూరలు పండించే రైతులు ప్రతి వారం వారి పంటలను సంతలో విక్రయించుకోవడానికి అవకాశం ఉంటుంది. దీంతో వారాంతపు సంతకు స్థలంలేక ఇక్కట్లు తప్పడంలేదు. మండల కేంద్రంలోని ఎన్నెస్పీ క్యాంపు ఆవరణలో స్థలం అందుబాటులో ఉంది. ప్రతి వారం కూరగాయల సంతను నిర్వహించుకోవడానికి ఎన్నె స్పీ క్యాంపు ఆవరణను వినియోగించుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. ట్రాఫిక్‌కు కూడా ఎలాంటి ఇబ్బందులు ఉండవు. శాశ్వత దుకాణాలు ఏర్పాటు చేయకుండా ప్రతి సోమవారం నిర్వహించే కూరగాయల సంతకు ఎన్నెస్పీ ఆవరణలో అధికారులు అనుమతి ఇస్తే అనుకూలంగా ఉంటుందని వ్యాపారులు, మండల ప్రజలు కోరుతున్నారు. గ్రామ పంచాయతీకి సైతం ప్రతి వారం ఆదాయం వస్తుండడంతో సౌకర్యాలు కల్పించాల్సి బాధ్యత ఉందని మరికొందరు పేర్కొన్నారు.

వర్షాకాలంలో మరింత ఇబ్బంది



ప్రతి వారం నిర్వహించే సంత వల్ల ప్రత్యేకంగా స్థలం లేకపోవడంతో రోడ్డుకు ఇరువైపులా రైతులు, వ్యాపారులు కూరగాయలు అమ్ముకుంటున్నారు. వాహనాలు నిలపడానికి స్థలం ఉండడంలేదు. కూరగాయలు కొనడానికి ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ముఖ్యంగా వర్షాకాలంలో మరిన్ని ఇబ్బందులు తప్పవు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ముకుమ్మడిగా సంతకు ప్రత్యేక స్థలం చూపడానికి చొరవతీసుకోవాలి.

– కిలారి సైదులు, బెజ్జికల్

స్థలం కేటాయించాలి



ఎన్నెస్పీ క్యాంపు ఆవరణలో సోమవారం కూరగాయల సంతను నిర్వహించుకోవచ్చు. నడి రోడ్డుకు ఇరువైపులా కూరగాయల దుకాణాలతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ప్రధాన రహదారి కావడంతో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. సంతకు వచ్చే ప్రజల వాహనాలు నిలుపుకోవడానికి స్థలం లేక రోడ్డుపైనే నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్ జాం అవుతుంది. అధికారులు పరిశీలించి తగిన స్థలం సంతకు నిర్వహణకు కేటాయించాలి.

– అనుముల సుధాకర్ రెడ్డి

క్లుప్తంగా

నేటి నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం

హాలియా : మండలంలోని రామడుగు సబ్‌స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాలకు సోమవారం నుంచి 14వ తేదీ వరకు విద్యుత్ సరఫరాల్లో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ధన్‌రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రామడుగు సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్లపై నుంచి వచ్చే 400కేవీ లైన్లుకు మరమ్మతులు చేస్తున్న కారణంగా వరుసగా ఆరు రోజుల పాటు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు రామడుగు, కుపాసిపల్లి ఫీడర్ల కింద విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. రామడుగు, కుపాసిపలి గ్రామాల వ్యవసాయ గృహదారులు, వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి, అధికారులకు సహకరించాలని కోరారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం


అన్నదాత దంపతులను సన్మానిస్తున్న అయ్యప్ప మాలధారులు

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రమౌళీశ్వర అయ్యప్ప స్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అయ్యప్ప మాలధారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాత దంపతులు పట్టణానికి చెందిన సుముద్రాల స్వప్న, మధు దంపతులను అయ్యప్ప మాలధారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి చిట్టెడి ప్రభాకర్‌రెడ్డి, గుమ్మడవెల్లి జనార్దన్, మహేష్, బోడ నగేష్, అయ్యప్ప మాలాదారులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి ఆలయ చైర్మన్‌గా కేశవ రెడ్డి

త్రిపురారం : నిడమనూరు మండలంలోని రేగుల గడ్డ గ్రామంలో వెలసి ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయ చైర్మన్‌గా గ్రామానికి చెందిన చామల కేశవ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఎండోమెంట్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పాలక వర్గ సభ్యులుగా బొల్లెంపల్లి కలమ్మ, పిల్లి సైదమ్మ, చామల రాంరెడ్డి, మల్లికంటి అంజయ్య నియమితులయ్యారు.

‘పుష్ప-2’ వేషధారణలో బాలుడు హల్‌చల్



మిర్యాలగూడ టౌన్ : ప్రముఖ సినీ నటుడు అల్లు అర్జున్ నటించిన పుష్ప-2 సినిమాలోని అమ్మవారి వేషధారణలో ఓ బాలుడు పట్టణంలోని రాఘవ థియేటర్‌లో ఆదివారం సందడి చేశాడు. పట్టణంలోని హనుమాన్‌పేటకు చెందిన రాజేశ్ ఆ వేషధారణతో థియేటర్‌కు వచ్చిన ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు.

ఆశాలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

నల్లగొండ టౌన్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం నల్లగొండలో నిర్వహించిన సీఐటీయూ జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు అమలు చేయాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, రిటర్మెంట్ బెనిఫిట్స్ సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న జరిగే నిర్వహించనున్న చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో డి.మహేశ్వరి, పెంజర్ల సైదులు, ఆర్.కవిత, జి విమల, టీ.పుష్పలత, కే.శైలు, బి.అనూష, బి రేణుక, ఎండీ అఫీజ, లక్ష్మి, స్వప్న, వెంకటమ్మ, సుజాత, మాధవి, జానకమ్మ, జానకి తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న కంపెనీలు


మాట్లాడుతున్న సత్తయ్య

నల్లగొండ టౌన్ : ఫార్మా కంపెనీలు కార్మికుల హక్కులను కాలరాస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య అన్నారు. తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ పదో వార్షికోత్సవ సందర్భంగా నల్లగొండలో ఆదివారం సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం భవనంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దండంపల్లి సత్తయ్య పాల్గొని మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భానుకిరణ్, రాజుభట్, తుమ్మల వీరారెడ్డి, హనుమంతరావు, కోట సుధాకర్, సోమస్వామి, చెరుపల్లి నిరంజన్, రావుల రవికుమార్, పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం


హాలియాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

హాలియా : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. ఆదివారం పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా అన్ని రంగాల్లో వైఫల్యం చెందిందని, తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రభుత్వం సంబరాలను జరుపుకుంటుందన్నారు. ఏడాది కాలంలో సాగర్ నియోజకవర్గ అభివృద్ధి శూన్యమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఏడాది కాలంలో రూ.150 కోట్లు తీసుకొచ్చి రోడ్లు, భవనాలు, వంతెనలు, అంతర్గత రహదారులు, డ్రెయినేజీ కాల్వల నిర్మాణం తదితర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేసినట్లు తెలిపారు. మొదటి ఏడాది కాలంలో ప్రస్తుత ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి సాగర్ నియోజకవర్గానికి ఏం చేశాడో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. గతంలో జానారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేపట్టిన ఇరిగేషన్, ఆస్పత్రి భవన నిర్మాణ పనులను సైతం బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత నోముల నర్సింహ్మయ్య ఎమ్మెల్యేగా ఉండి పనులు పూర్తి చేయించినట్లు తెలిపారు. సాగర్ నియోజకవర్గ అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని అందుకు ఎమ్మెల్యే సిద్ధమా అని ప్రశ్నించాడు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కూరాకుల వెంకటేశ్వర్లుచ పిడిగం నాగయ్య, తాటి సత్యపాల్, జటావత్ రవినాయక్, నాగులవంచ తిరుపతిరావు, పట్టణ అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, నాయకులు నల్లగొండ సుధాకర్, జవ్వాజి వెంకటేశ్వర్లు, వెంకట్‌రెడ్డి, కామర్ల జానయ్య, చాపల సైదులు, సురభి రాంబాబు, మాజీ ఎంపీపీ ఏడుకొండలు, రావుల లింగయ్య, ఆవుల సైదులు, బైరం కృష్ణ, పగడోజు సైదాచారి, మెండె సైదులు, రెడ్డిపల్లి జానకిరాములు, మధు తదితరులు ఉన్నారు.

తండాల అభివృద్ధికి నిధులు కేటాయించాలి


రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతిపత్రం అందజేస్తున్న దశరథ్‌నాయక్

మిర్యాలగూడ : గిరిజన విద్యాభివృద్ధి కోసం ఏకలవ్య, ఆదర్శ గురుకుల పాఠశాలలతోపాటు, గిరిజన తండాల్లో అభివృద్ధి కోసం ట్రైకార్ ద్వారా ప్రత్యేక నిధులు కేటాయించాలని బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథ్ నాయక్ అన్నారు. నాయక్ అన్నారు. ఆదివారం దామరచర్ల మండలం కొండ్రపోల్‌లో ఆయన కేంద్ర ఏకలవ్య గురుకుల ఆదర్శ పాఠశాలల ఏర్పాటు కమిటీ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ ప్రిన్సిపల్ సెక్రటరీ అదావత్ శంకర్‌నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గిరిజన జనాభా ఎక్కువగా ఉండే నియోజకవర్గాల్లో గిరిజనుల అక్షరాస్యత పెంచేందుకు ఆదర్శ ఏకలవ్య పాఠశాలలను ఏర్పాటు చేయాలని, మారుమూలతండాల్లో కనీస సౌకర్యాలు కల్పించి అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమలో మక్లా, జైత్రాం నాయక్, ధీరావత్ మోహన్ నాయక్, సైదానాయక్, జామ్లనాయక్, రవి నాయక్, శశిధర్‌నాయక్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

కొండమల్లేపల్లి : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ కోరారు. ఆదివారం దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వంద మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.52లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేసి మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. దేవరకొండలోని వంద పడకల ఆస్పత్రిని త్వరలోనే 200 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం నేరెడుగొమ్ము, చందంపేట మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి, షాదిముబారక్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, వెంకటయ్యగౌడ్, వెంకటేశ్వర్లు, పీఏసీఎస్ చైర్మన్ శ్రీశైలంయాదవ్, వేణుధర్ రెడ్డి, హనుమంతు వెంకటేష్‌గౌడ్, మాజీ ఎంపీపీలు దూదిపాల రేఖ, ముత్యాల సర్వయ్య, గోవిందుయాదవ్, బిక్కునాయక్, రుక్మారెడ్డి, నాయకులు యుగేందర్‌రెడ్డి, తేర సత్యనారాయణరెడ్డి, సురేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, బద్యానాయక్, కొర్ర రాంసింగ్ నాయక్, రమేష్‌నాయక్, సుభాష్‌నాయక్, సైదులు, చంద్రశేఖర్, వెంకటయ్య, సాదిక్, శ్రీనివాస్‌యాదవ్, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ


బాపూజీనగర్‌లో ఆలయానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : పట్టణంలోని బాపూజీనగర్‌లో గల పుట్ట గుడి వద్ద ఆదివారం శ్రీ నాగేంద్రస్వామి, శ్రీసుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను కలిగి ఉండాలన్నారు. ఆలయ నిర్మాణానికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు కొమ్మన నాగలక్ష్మి, పాతూరి ప్రసాద్, ముదిరెడ్డి నర్సిరెడ్డి, నాయకులు చిలుకూరి బాలు, మేకల శ్రీనివాస్, గుడిపాటి నవీన్, వంకాయలపాటి చలపతిరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

కొండమల్లేపల్లి : మండల పరిధిలోని కేజీబీవీ, బీసీ బాలుర గురుకుల, మైనార్టీ గురుకుల పాఠశాలలో ఆదివారం విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనాన్ని కొండమల్లేపల్లి మాజీ ఎంపీపీ దూదిపాల రేఖశ్రీధర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మెనూ వివరాలు, వంట సామగ్రి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వంట గదిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆమె వెంట మంగ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎంపీపీ దూదిపాల రేఖశ్రీధర్‌రెడ్డి

అల్లం కిరణ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు టాలెంట్ టెస్ట్


టాలెంట్ టెస్ట్‌కు హాజరైన విద్యార్థులు

మిర్యాలగూడ టౌన్ : ఈనెల 13న అల్లం కిరణ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని లోటస్ స్కూల్‌లో ప్రభుత్వ, పాఠశాల విద్యార్థులకు టాలెంట్ టెస్ట్, ఎస్సే రైటింగ్ కాంపిటీషన్‌ను అల్లం కిరణ్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కేతనపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ టాలెంట్ టెస్ట్, ఎస్సే రైటింగ్‌కు వివిధ పాఠశాలల నుంచి 300మంది విద్యా ర్థులు హాజరు కావడంతో భారీ స్పందన లభించింది. ఈ టెస్ట్‌లో ప్రతిభను కనబరిచిన వారికి 13న వర్ధంతిలో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

తీన్మార్ మల్లన్నను పిలువకపోవడం సరికాదు


మాట్లాడుతున్న బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మహేశ్ గౌడ్

మిర్యాలగూడ టౌన్ : దామరచర్ల మండలం వీర్లపాలెంలోని థర్మల్ పవర్ ప్లాంటు ప్రారంభానికి ఖమ్మం, నల్లగొండ, వరంగల్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను పిలువకపోవడం సరికాదని, ఇది ముమ్మాటికి సీఎం రేవంత్‌రెడ్డి బీసీలను అవమానించడమేనని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు జి. మహేష్ గౌడ్ అన్నారు. ఆదివారం స్థానిక బీసీ సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ బీసీలను అణగదొక్కే ధోరణిని సీఎం అవలంబిస్తున్నారని, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఈదే విధంగా వ్యవహరిస్తే బీసీలు తగిన బుద్ధి చెప్పినట్లు తెలిపారు. బీసీలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే కనీసం బీసీ ఎమ్మెల్సీ మల్లన్నను పిలువకపోవడం దురదృష్టకరంగా ఉందన్నారు. బీసీలను విస్మరిస్తే పతనం తప్పదన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు రాజు, శ్రీనివాస్, రవీందర్, పద్మ, అశోక్, నరేందర్, రమేష్ పాల్గొన్నారు.

కబ్జాదారుల నుంచి ఆశ్రమాన్ని కాపాడాలి



మాట్లాడుతున్న జగ్జీవన్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: పట్టణంలోని గంధంవారిగూడెంలో ఉన్న మాణిక్యేశ్వరి మాత ఆశ్రమాన్ని రణదేవ్ మహరాజ్ నుంచి కాపాడాలని మాణిక్యేశ్వరి మాత సెంట్రల్ కమిటీ మెంబర్ జగ్జీవన్‌రెడ్డి కోరారు. ఆదివారం భక్తులతో కలిసి రామగిరి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రణదేవ్ అనే వ్యక్తి మాణిక్యేశ్వరి మాత ఆశ్రమ పీఠాధిపతిని అని ప్రకటించుకుని హైదరాబాద్ నుంచి బౌన్సర్లను, కొంత మంది స్థానికులను తీసుకొచ్చి 30 సంవత్సరాలుగా ఆశ్రమం నిర్వహిస్తున్న గంగాధరచారిని దౌర్జన్యంగా బయటకు వెళ్లగొట్టాడన్నారు. రణదేవ్ తనకు తానే పీఠాధిపతి అని ప్రకటించుకుని ఆశ్రమాన్ని కబ్జా చేశారని ఆరోపించారు. కర్ణాటకలో ఉన్న సెంట్రల్ కమిటీ ఆశ్రమ పీఠాధిపతిని నియమిస్తుందన్నారు. కబ్జాదారుడిపై భక్తులతో కలిసి డీఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. విచారణ జరిపి భక్తులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో వివిధ జిల్లాల్లోని మాతా మాణిక్యేశ్వరి ఆశ్రమాల నిర్వాహకులు శివరాంరెడ్డి, యాదయ్య, వెంకట్ రాములు, వీరన్న, వెంకట్‌రెడ్డి, నరేందర్, శంకర్, రామకృష్ణ, నాగిరెడ్డి, వెంకటేష్, ఆంజనేయులు, భీమన్న, హనుమంతు, శేఖర్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆనాటి ఉపాధ్యాయిలను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

డిండి : మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995–96 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు స్థానిక ఈజే గార్డెన్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను తలచుకున్నారు. ప్రస్తుత పరిస్థితులను ఒకరికొకరు యోగా క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చదువు చెప్పిన ఉపధ్యాయులను శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో రవీందర్, రేణయ్య, లక్ష్మయ్య, మల్లిఖార్జున్, ఖలీల్, రమేష్, భద్రావతి, పుష్ప, స్వర్ణ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో లిటిల్ ఫ్లవర్ విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జయరాజన్

మిర్యాలగూడ : సుమన్ షోటోఖాన్ కరాటే అకాడమి ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే ప్రదర్శనలో స్థానిక లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను చాటి ఎల్లో బెల్ట్‌ను సాధించారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ఆదివారం పాఠశాల ప్రిన్సిపాల్ కెకె.జయరాజన్ అభినందించి మాట్లాడారు. పిల్లలకు ఆపద సమయంలో తమను తాము రక్షించుకోవడానికి కరాటే ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కరాటే వల్ల పిల్లలు ఆరోగ్యంగా, చురుకుగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ బూడిద సైదులు, కోచ్ రామకృష్ణనాయక్, హెచ్ఎం ఎం.సుజయ్‌కుమార్, పీఈటీలు నీలం రమేష్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

హుజూర్‌నగర్ : రాజకీయ జోక్యం లేకుండా అర్హులకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగారపు పాండు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో వేలాదిమంది నిరుపేదలు ఇళ్ల స్థలాలు, ఇండ్ల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి పల్లె వెంకటరెడ్డి, నాయకులు పంగా వెంకటేష్, దుగ్గి బ్రహ్మం, పాల్గొన్నారు.

‘స్థానిక’ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి

హుజూర్‌నగర్ : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రెడపంగు రాము కోరారు. ఆదివారం హుజూర్‌నగర్‌లోని ఇందిరా భవన్‌లో నిర్వహించిన యూత్ కాంగ్రెస్ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలను యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రజల్లోకి బలంగా తీసుకుపోవాలని సూచించారు. మంత్రి ఉత్తమ్ సారథ్యంలో అభివృద్ధిలో హుజూర్ నగర్ నియోజకవర్గం రాష్ట్రంలోనే మొదటి స్థానం కైవసం చేసుకోనుందని తెలిపారు. మంత్రి ఉత్తమ్ ఆదేశాల మేరకు యూత్ కాంగ్రెస్ పట్టణ పూర్తిస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. అన్ని సామాజిక వర్గాలకు స్థానం కల్పిస్తామని తెలిపారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ కార్యదర్శి పిల్లి శివ, నియోజకవర్గ ప్రచార కార్యదర్శి కస్తాల రవీందర్, నాయకులు గొట్టెముక్కల రాములు, కస్తాల సైదులు, దగ్గుపాటి బాబురావు, బొల్లెద్దు అరుణ్ కుమార్, ఊదర రంజిత్, కోల్లపూడి ప్రవీణ్, భారతం రాజు, కామల్ల రాజా, మెండ రమేష్, కందుల వెంకన్న, మాడుగుల దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరం నిర్వహించడం అభినందనీయం


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ టౌన్: పట్టణంలో ఉచితంగా యునాని మెగా హెల్త్, హిజామా క్యాంపు నిర్వహించడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నల్లగొండ పట్టణంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. హైదరాబాద్ నుంచి 25 మంది డాక్టర్లు పరీక్షలు నిర్వహించి సుమారు రూ.5 లక్షల విలువ గల మందులను పంపిణీ చేయడం ప్రశంసనీయమన్నారు. హెల్త్ క్యాంపు ఇన్‌చార్జులు డాక్టర్ ఎ.ఎ.ఖాన్, నేషనల్ షరీఫ్ ఆధ్వర్యంలో దాదాపు 1200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు అవసరమైన మందులు అందజేశారు. స్త్రీలకు మహిళా వైద్యులతో కప్పింగ్ థెరపీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, యోగా గురుజీ రాపోలు వెంకటేశ్వర్లు, సింగం ప్రవీణ్, చొక్కారపు వెంకన్న, కిశోర్, శ్రవణ్, శేఖర్, మహేశ్వరి పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను కాలరాస్తున్న పాలకులు

గరిడేపల్లి : పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని సీపీఎం మండల కార్యదర్శి ఎస్‌కె యాకూబ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని రాయినిగూడెం గ్రామంలో నిర్వహించిన మధ్యాహ్న భోజన ఏజెన్సీల జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజా వ్యతిరేక విధానాలను వీడి ఎన్నికల్లో కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు ఇస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఈ నెల 16, 17వ తేదీల్లో కలెక్టర్ కార్యాలయం ఎదుట తమ సమస్యల పరిష్కారం కోసం వంటవార్పు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోలా నాగమణి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వెంకటరమణ, విజయ, సువరమ్మ, నాగలక్ష్మీ, జ్యోతి, నాగమణి, పద్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యాధరచారికి ‘కామధేను’ జాతీయ పురస్కారం


విద్యాధరచారికి జాతీయ పురస్కారం అందజేస్తున్న హైకోర్టు జడ్జి

చింతపల్లి : మండలంలోని అంగడి కుర్మపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ సూక్ష్మ కళాఖండాల నిపుణులు డాక్టర్ ముంజంపల్లి విద్యాధరచారికి కామధేను జాతీయ పురస్కారం వరించింది. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతీలో విద్యాధరచారికి హైకోర్టు జడ్జి సూర్యపెల్లి నందా కామధేను జాతీయ పురస్కారం అందజేశారు. సూక్ష్మకళారంగంలో అతడి సూక్ష్మ కళ మహా అద్భుత సృష్టి. సూక్ష్మ దర్శినితో చూస్తే తప్ప కనిపించని సూక్ష్మ కళాఖండాలను సృష్టించడంలో విద్యాధరచారి దిట్ట. ఆవగింజపై ఆదిదేవుడు వినాయకుడి చిత్రాన్ని చిత్రీంచి జై గణపతి కి జై అంటూ తెలుగు అక్షరాలలో రాశాడు. భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం పేరును తల వెంట్రుకపై ఏపీజే అబ్దుల్ కలాం ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా ఆంగ్ల అక్షరాలలో రాసి అబ్దుల్ కలాంకు అందజేసి అభినందనలు అందుకున్నారు. ఒకే ఒక బియ్యపు గింజపై 133 తెలుగు అక్షరాలు గల జాతీయ గీతాన్ని రాసి అందరిని అబ్బురపరిచాడు. ప్రపంచంలోనే అతి చిన్న తాళం, తాళం చెవి తయారుచేసి 2004లో లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో తన పేరును నమోదు చేసుకున్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని సూది రంధ్రంలో ఆరు స్వర్ణ శివలింగాలను అమర్చాడు. గురివింద గింజలో ఇమిడే చదరంగాన్ని రూపొందించారు. ఫారెస్ట్ బీట్ పరీక్ష ప్రశ్నాపత్రంలో డాక్టర్ ముంజంపల్లి విద్యాధర్‌చారికి సంబంధించిన ఒక ప్రశ్నను చేర్చడం అతడి సూక్ష్మ కళా ప్రతిభకు నిదర్శనం అని చెప్పవచ్చు. భవిష్యత్‌లో తన చేతిలో రూపుదిద్దుకున్న సూక్ష్మ కళాఖండాలతో హైదరాబాదు నగరంలో మ్యూజియంను ఏర్పాటు చేయాలన్నది లక్ష్యమని విద్యాధరచారి పేర్కొన్నారు.